# మాతృభాషలోనే అమ్మతనం కనిపిస్తుంది

- జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్



నాగర్‌కర్నూల్‌టౌన్ : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో

నాగర్‌కర్నూల్‌టౌన్/తాడూరు, ఫిబ్రవరి 21 : ప్రస్తుత సమాజంలో మాతృభాషను తక్కువ చేస్తూ ఇతర భాషల పట్ల మక్కువ చూపడం వల్ల మాతృభాష కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని మాతృభాషలోనే అమ్మదనం మెండుగా కనబడుతుందని జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ తెలుగు సబ్జెక్టుల ఫోరమ్ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా మహోన్నతమైనదని, ఎందరో కవులు బాషను సుసంపన్నం చేశారని, వారి పరంపరను అలాగే కొనసాగించాలని కోరారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ టెస్టులో తాడూరు మండలం సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు జిల్లా స్థాయిలో భారతి మొదటి బహుమతి గెలుపొందగా, రెండో బహుమతి గాయత్రి గెలుపొందారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవో కుర్మయ్య, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం సురేఖ, తెలుగు సబ్జెక్ట్ ఫోరం అధ్యక్షుడు రామోజీ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**లింగాలలో..**

లింగాల, ఫిబ్రవరి 21 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గాయకుడు మల్లెకేడి పాండు తన ఆటపాటలతో విద్యార్థులను అలరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం కొండయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాషపై పట్టు సాధించాలన్నారు. అదేవిధంగా మండలంలోని చెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అవని వారధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలుకలు, పరీక్ష ప్యాడ్స్‌ను తెలుగు ఉపాధ్యాయురాలు సాయిజ్యోతి పంపిణీ చేశారు. అనంతరం రామాచార్యులుకు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రతినిధులు అశోక్‌కుమార్, రామాచార్యులు, ప్రముఖ సంకీర్తనపరులు జంగయ్య, వెంకటేశ్, శివాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**డిగ్రీ కళాశాలలో..**

కొల్లాపూర్, ఫిబ్రవరి 21 : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ మాతృభాషా గొప్పదనాన్ని వివరించారు. జీవశాస్త్ర అధ్యాపకులు కురుమయ్య మాట్లాడుతూ భాష యొక్క ఔన్నత్యాన్ని, భాషోద్యమంలో భాగంగా డాకా విశ్వవిద్యాలయంలో అమరులైన విద్యార్థులను గుర్తుకు చేసుకునేందకు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలరాజు, షోఫి పాషా, మహాదేవుడు, శివుడు, అనిత, మౌనిక, విష్ణు, బాలు, కేశవులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**నవోదయ పాఠశాలలో..**

బిజినేపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని వట్టెం గ్రామంలో గల జవహర్ నవోదయ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ మాతృభాష ఎంతో ముఖ్యమైందని, దానిని రక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, భాస్కరాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



లింగాల : రామాచార్యులు శర్మను సన్మానిస్తున్న వికాస తరంగిణి సభ్యులు



బిజినేపల్లి : నవోదయ పాఠశాలలో మాతృభాష దినోత్సవం జరుపుకుంటున్న దృశ్యం



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

## వరద బాధితులకు పడవ తయారీ

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 21: మండలంలోని ముష్టిపల్లి గ్రామ జిల్లా పరిషత్ విద్యార్థులు వరద బాధితుల కోసం ఇంట్లో ఉండే వస్తువులతో పడవ తయారు చేసి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం డీఈవో రమేశ్ కుమార్ పడవ తయారు చేసిన సాయి చరణ్, ప్రవీణ్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సుజాత, జగదీశ్‌లను అభినందించారు. అంతేకాకుండా జాతీయ ప్రాజెక్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. దీంతో విద్యార్థుల సృజనాత్మకతను ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేఖ, ఉపాధ్యాయులు శైలజ ఉన్నారు.

## ధరణి పెండింగ్ రికార్డుల తనిఖీ



ధరణి పెండింగ్ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో భన్సిలాల్

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని కొల్లాపూర్ ఆర్డీవో భన్సిలాల్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైల్స్‌ను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యాలయానికి అధికారులు సమయపాలన పాటించి అన్ని ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో తాసీల్దార్ మోహన్, డిప్యూటీ తాసీల్దార్ రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

## రిసోర్స్ పర్సన్లకు అవగాహన సదస్సు

కల్వకుర్తి, ఫిబ్రవరి 21 : కల్వకుర్తి మున్సిపాలిటీలో శుక్రవారం పట్టణ మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్‌లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ రిసోర్స్ పర్సన్లకు అవగాహన కల్పించారు. కొత్తగా మహిళా గ్రూపుల ను ఏర్పాటు చేయాలని, బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలు వెంటనే మంజూరు అయ్యే విధంగా పనిచేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్‌లు విధుల పట్ల అలసత్యం ప్రదర్శిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెప్మాసిబ్బంది, రిసోర్స్ పర్సన్లు, శివ పాల్గొన్నారు.

## మండలంలో పంటలు పరిశీలన

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని నార్లాపూర్, రామ్‌నాయక్ తండా, లక్ష్మణ్‌నాయక్ తండా, ముక్కిడిగుండం, మొల్లచింతలపల్లి గ్రామాల్లోని వ్యవసాయ మండల అధికారి చిన్న హుసేన్ యాదవ్ వరి, మొక్కజొన్న పంటలను, పరిశీలించారు. వరిలో ప్రస్తుతం జింక్ లోపం, సూక్ష్మ ధాతు లోపాలు, అగ్గి తెగులను గమనించినట్లు తెలిపారు. వాటి నివారణకు తీసుకొవాల్సిన చర్యలను రైతులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రాచూర్‌లో స్ప్రింక్లర్లు పంపిణీ

వెల్దండ, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని రాచూర్‌లో పలువురు రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో స్ప్రింక్లర్లను మంజూరు చేసింది. దీంతో రైతులు కృష్ణయ్య, లక్ష్మయ్య, జంగయ్యలకు మంజూరైన స్ప్రింక్లర్లను గ్రామ మాజీ వార్డు సభ్యుడు వెంకటేశ్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, డీలర్ శ్రీధర్ ఉన్నారు.

## ఘనంగా కళాశాల వార్షికోత్సవం

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 21 : అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ కోఎడ్యుకేషన్ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవం నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను మార్చేది ఇంటర్మీడియట్ అని మంచి నిర్ణయాన్ని తీసుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : తెలకపల్లి మండలంలోని పెద్దపల్లిలో గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్వే నెంబర్ 560లో గల 15 గుంటల ప్రభుత్వ భూమిని గతంలోనే గ్రామ పంచాయతీ తీర్మానంతో స్థలాన్ని కేటాయించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక నాయకుల కన్ను గ్రంథాలయానికి కేటాయించిన స్థలంపై పడింది. దీంతో ఆస్థలంలో నుంచే కొంత స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ కార్యకర్త ఇంటి నిర్మాణానికి కట్టబెట్టడానికి యత్నిస్తున్నారని గ్రామానికి చెందిన కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆక్రమణకు సంబంధించిన విషయాన్ని పరిశీలించాలని తాసీల్దార్ మహ్మద్ జాకీర్‌అలీని ఫోన్ ద్వారా ఆదేశించినట్లు సమాచారం. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ పేర్కొన్నారు.

### బాలుడికి తీవ్ర గాయాలు

తాడూరు, ఫిబ్రవరి 21 : ఆటో, స్కూటీ ఢీకొన్న ఘటన తాడూరు మండల కేంద్రం సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై గురుస్వామి కథనం మేరకు తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆటో యాదిరెడ్డిపల్లి గ్రామం నుంచి తాడూరు వైపు వస్తున్న క్రమంలో యాదిరెడ్డిపల్లి చెందిన రాజు తన స్కూటీపై భార్య, కుమారుడితో తాడూరుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో తాడూరు సమీపంలో ఆటో, స్కూటీ ఢీకొన్నాయి. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న రాజు, కుమారుడు దీక్షిత్(8)తోపాటు భార్య కింద పడిపోయారు. దీక్షిత్‌కు తీవ్ర గాయాలు కాగా నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించగా రాజు తన భార్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. రాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత : కేసు నమోదు

చారకొండ, ఫిబ్రవరి 21: మండలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం మండలంలోని గోకారం సమీప గుట్టలో సారంబండతండాకు చెందిన నవీన్ తన బొలేరో వాహనంలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం నింపుతుండగా పట్టుబడినట్లు చెప్పారు. అదేవిధంగా చారకొండలో శారద ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన బొలేరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీటీ ఫిర్యాదు మేరకు నవీన్, శారదలపై కేసు నమోదు చేసి చేసిన్నట్లు హెచ్‌సీ శ్రీశైలంగౌడ్ తెలిపారు.

## అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇల్లు రాలే..

- శిథిలావస్థకు చేరిన ఉషారాణి ఇల్లు
- ఆరు నెలలుగా ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ భవనంలో నివాసం



కమ్యూనిటీ హాల్‌లో నివాసం ఉంటున్న ఉషారాణి

బల్మూరు, ఫిబ్రవరి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించేందుకు మండలానికి ఒక పైలట్ గ్రామాన్ని గుర్తించింది. అందులో భాగంగా జినుకుంటలో గత 26న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కానీ అర్హత ఉన్న ఓ పేదరాలికి మాత్రం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయలేదు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉషారాణి భర్త శ్రీనివాసులు ఇల్లు శిథిలావస్థలో ఉండడంతో ఆ కుటుంబం మొత్తం ఎస్సీ కాలనీలో ఉన్న కమ్యూనిటీ భవనంలో ఆరు నెలలుగా నివాసం ఉంటున్నది. అధికారులు గత నెలలో నిర్వహించిన సర్వేలో ఇంటిని ఆర్‌సీ అని నమోదు చేసుకోవడంతో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఆమె లాంటి వారే గ్రామంలో పది మంది ఉన్నారని వారికి కూడా అధికారులు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయలేదని, కేవలం కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికి మాత్రమే ఇండ్లను మంజూరు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి నిరంజన్‌ను వివరణ కోరగా ఉషారాణి ఎల్-3లో ఉందని, రేషన్‌కార్డు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని చెప్పారు. అయితే ఉషారాణి ఇల్లు శిథిలావస్థలో ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని పేర్కొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కాలనీలో లో వోల్టేజీ సమస్యను దృష్టిలో ఉంచుకొని కొత్తగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ఆదేశాల మేరకు దీనిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, షేక్ ముబారక్, శేరు, సెహ్వాగ్ పాల్గొన్నారు.

## పురాతన నాణేల ఎగ్జిబిషన్ ప్రారంభం



పురాతన నాణేలను పరిశీలిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, ఏఎస్పీ

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 21 : జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ పీజీ కళాశాలలో శుక్రవారం పురాతన నాణాల ప్రదర్శన కార్యక్రమా న్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పురాతన నాణాలను శంఖువులను, సముద్ర గవ్వలను, ముత్యాలను పరిశీలించారు. ఈ నాణాలను ఎక్కడి నుండి సేకరించారు? ఏ సంవత్సరానికి చెందాయి? వంటి వివరాలను చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ధర్మ, డాక్టర్ హాజీరా పర్వీన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థులకు పురాతన కాలపు నాణేల గొప్పతనాన్ని వాటి ప్రత్యేకతను అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ ధర్మ, డాక్టర్ హాజీరా పర్వీన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలం నీటిని అక్రమంగా దోపిడీ చేస్తున్న ఏపీ సర్కారు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్
- శ్రీశైలం రిజర్వాయర్‌ను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు



శ్రీశైలం డ్యాం వద్ద బీఆర్ఎస్ నేత విజయ్‌కుమార్

అచ్చంపేట, ఫిబ్రవరి 21 : ఏపీ సర్కారు కృష్ణా నది శ్రీశైలం ప్రాజెక్టు నుంచి అక్రమంగా నీటిని దోపిడీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ గురువు చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ అ న్నారు. బీఆర్ఎస్ నాయకులు శు క్రవారం శ్రీశైలం డ్యాం ను పరిశీలించారు. ఈ క్రమంలో పోలీసు లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, నాగార్జున సాగర్ నుంచి చంద్రబాబునాయుడు ప్రతి రోజు అక్రమంగా నీటిని తీసుకెళ్తు శ్రీశైలం రిజర్వాయర్‌ను ఎండబెడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబుపై ఉన్న మమకారం తెలంగాణ ప్రజలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి పాలమూరు ప్రాజెక్టులకు సాగునీరు అందించి కాపాడారన్నారు. నల్లమల బిడ్డను అని చెప్పుకునే సీఎం రేవంత్ నల్లమల నుంచి ఏపీ సర్కార్ నీళ్లను దోచుకెళ్తుంటే ఎందుకు చూస్తు ఊరుకుంటున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర జలశక్తి కార్యాలయానికి వెళ్లి అడగాలని, ఆందోళన నిర్వహించాలన్నారు.

# హంసవాహనంపై ఊరేగిన భ్రామరి, మల్లన్న స్వామి



హంసవాహనాధీశులై పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 21 : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం చండీశ్వరపూజ, మండపారాధన, కలశార్చన, శివపంచాక్షరీ జపానుష్టానాలు, రుద్రపారాయణం, రుద్ర హోమం, చండీహోమం నిర్వహించారు. సాయంకాలార్చనలు హోమాల అనంతరం స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై ఊరేగించారు. అనంతరం కాళరాత్రిపూజ మంత్రపుష్పంతోపాటు స్వామిఅమ్మవార్లకు ఆస్థానసేవ నిర్వహించారు.

**భక్తులకు చిత్తశుద్ధితో సేవలందించాలి**

శ్రీశైల మహా క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు తరలి వస్తున్న యాత్రికులకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో సేవలందించాలని దేవస్థాన ఈవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉదయం క్షేత్ర పరిధిలో పర్యటిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన వెంట ఈఈ నర్సింహారెడ్డి, ఏఈవో స్వాములు, ఆలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ తప్పని సరి



పాఠశాలలో ఎంఈవో బషీర్‌అహ్మద్

లింగాల, ఫిబ్రవరి 21 : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ఆశ్రమ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ తయారు చేయాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోమటికుంట, దత్తారం, జీలుగుపల్లి పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బషీర్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలి

బల్మూరు, ఫిబ్రవరి 21 : మండలంలోని జినుకుంట, అనంతవరం, బల్మూరు, పోలిశెట్టిపల్లి గ్రామాల్లో మట్టి తరలింపు జోరుగా సాగుతున్నది. అక్రమార్కులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.400 నుంచి రూ.600 మట్టిని విక్రయిస్తూ తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అంతే కాకుండా 18 ఏండ్లలోపు పిల్లలతో ట్రాక్టర్లు నడిపించడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతోపాటు 18 ఏండ్లలోపు వారితో ట్రాక్టర్లు నడిపిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : ఉరేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలకపల్లి మండలం ఆలేరులో శుక్రవారం చోటు చేసుకున్నది. తెలకపల్లి ఎస్సై నరేశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాషమోని యాదగిరికి నాలుగేళ్ల కిందట నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్ చెందిన పిట్టల శివలీలతో వివాహం జరిగింది. వారికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు(కవలలు) ఉన్నారు. కొంత కాలంగా యాదగిరి వేరే స్త్రీతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నందున భార్యాభర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయం మనసులో పెట్టుకొని గురువారం రాత్రి 10:30 గంటల ప్రాంతం లో శిలీ ల ఆలేరులో తమ ఇంటిలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తండ్రి పిట్టల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## కళాశాలలో వీడ్కోలు సమావేశం

- ఘర్షణ పడ్డ విద్యార్థులు

వెల్దండ, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థుల మధ్య ఘర్షణకు దారి తీసింది. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి బీరు సీసాలతో దాడులు చేసుకునే స్థాయికి దిగజారారు అనడానికి నిదర్శనం ఈ ఘటన.. ఒక వైపు కళాశాలలో వీడ్కోలు పార్టీలో ఆట, పాటలు, వినోదం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మరో వైపు విద్యార్థుల మధ్య మాట మాట పెరిగి మద్యం మత్తులో బీరు సీసాలతో దాడులు చేసుకునే వరకు దారి తీసింది. ఈ క్రమంలో వెల్దండకు చెందిన ఓ విద్యార్థి చేతికి బీరు సీసా గాయం కాగా స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స తీసుకున్నాడు. దీనిపై ప్రిన్సిపాల్ స్పందిస్తూ ఘర్షణ విషయం తన దృష్టికి రాలేదని తనకు తెలియదన్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కళాశాలకు వెళ్లి గోడవపై ఆరా తీశారు. అందరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు.

## రంజాన్ మాసానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పరంగా ఏర్పాట్లను చేయాలని ముస్లింలు శుక్రవారం కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల్లోని మస్జిదులు ఈద్గాల వద్ద పారిశుధ్య పనులతో పాటు నీటి వసతి, విద్యుత్ పెయింటింగ్, ఇతర మరమ్మతులకోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రంజాన్ మాసంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో హబీబ్, ఖలీల్, మహ్మద్‌గౌస్, హబీబ్‌ఖాన్, నజీర్, మైనార్టీ నాయకులు ఖాదర్, ఇంతియాజ్, మహ్మద్ జాకీర్ ఖాన్, ఖాజాబాబా పాల్గొన్నారు.

### కేఎల్ఐ కాల్వ గుంతలో పడి యువకుడు మృతి

ఉప్పునుంతల, ఫిబ్రవరి 21 : బైక్ అదుపు తప్పి కేఎల్ఐ కాల్వ గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తాడూరు-చెన్నారం గ్రామాల మధ్య గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామానికి చెందిన వినోద్‌గౌడ్(22) మండల కేంద్రమైన డిండి వైన్ షాపులో పనిచేస్తున్నాడు. గురువారం చిన్నమ్మ గ్రామమైన తాడూర్‌కు వచ్చి భోజనం చేసిన అనంతరం రాత్రి 9గంటల సమయంలో డిండికి వెళుతూ మార్గమధ్యంలో కేఎల్ఐ కాల్వ గుంతలో పడి మృతి చెందగా శుక్రవారం ఉదయం అతని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

# 24న చలో కొండారెడ్డిపల్లి

- బాధితులకు న్యాయం చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు గీత



సమావేశంలో మాట్లాడుతున్న గీత

నాగర్‌కర్నూల్‌రూరల్, ఫిబ్రవరి 21 : జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు గీత మాట్లాడుతూ చారకొండ మండల కేంద్రంలో ఇండ్లను కూల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బాధితులకు అ రకొర పరిహారం ఇచ్చి బలవంతంగా వారి ఇళ్లను కూ ల్చివేశారు. బాధితుల పరిహారం కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో 12రోజులుగా రిలే నిరహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఇప్పటికైనా స్పందించి ఇండ్లు కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. లేకుంటే ఈనెల 24న కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రామయ్య, సభ్యులు అశోక్, సురేశ్, చంద్రశేఖర్, నాగరాజు గౌడ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

**పెంట్లవెల్లిలో..**

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 21 : ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చి న కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పేరిట తమ స్వలాభానికి అమాయక ప్రజల ఇండ్లను కూల్చి రోడ్డున పడేస్తున్నదని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీ ఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చారగొండ మండల కేంద్రంలో రహదారి నిర్మాణానికి ఇండ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు న్యాయం చేకూర్చేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 24న వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు హన్మంతు, నర్సింహ పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

## ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

కల్వకుర్తి, ఫిబ్రవరి 21 : కల్వకుర్తి మండలం జీడిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్, మార్చాల కాంప్లెక్స్ జీహెచ్ఎం వెంకటరమణ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ధాతలు సమకూర్చిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి జీహెచ్ఎం వెంకటరమణ రూ.2వేలు, గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి బీమ్లా రూ.వెయ్యి అందజేశారు. అనంతరం కల్వకుర్తి ఏఎస్సై హనుమంత్‌రెడ్డి, కల్యాణ్ సమకూర్చిన ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్‌ను వి ద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రఘురాం, సీఆర్‌పీ బిక్య ఉన్నారు.